కల సాకారమయ్యేనా..



బోరు బావి ద్వారా కొబ్బరి తోటలకు సాగునీటి సరఫరా

- ఎత్తిపోతలకు కోసం రైతుల ఎదురుచూపులు
- వేసవి వస్తే రైతన్నకు ఇబ్బందులే
- చౌడు బారిపోతున్న భూములు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల రైతులు సుదీర్ఘ కాలం నుంచి సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎంతో సారవంతమైన భూములు సరైన సాగునీరు లేక నిస్సారంగా మారిపోయాయి. భూగర్భం నుంచి వచ్చే జలాలు ఉప్పునీటి మయంగా మారడం రైతులను కలవరపెడుతోంది. ఉప్పునీటి ప్రభావంతో కొబ్బరికాయల దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. వేలాది రూపాయలు వ్యయం చేసి ఏటా వేసవిలో రైతులు కొబ్బరి తోటలకు నీటితడులు పెడుతున్నారు. దీని కోసం ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సిన పరిస్థితి. పాలకులు మారుతున్న లంక గ్రామాలకు సాగునీరందించే అప్పనపల్లి ఎత్తిపోతల పథకానికి మోక్షం లభించడం లేదని రైతులు మండి పడుతున్నారు.

నాలుగు వేల ఎకరాలకు మేలు

అప్పనపల్లి, పెదపట్నంలంక, పెదపట్నం, బి.దొడ్డవరం, మానేపల్లి గ్రామాలకు అప్పనపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మేలు జరుగుతుంది. చుట్టూ పుష్కలంగా గోదావరి జలాలు అందుబాటులో ఉన్నా ఆ జలాలు ఉప్పునీటి మయం కావడంతో ఇక్కట్లు తప్పడం లేదు. అయిదు గ్రామాల్లో 15 కిలో మీటర్ల పంటకాలువ ఏర్పాటుతో 4,035 ఎకరాల్లోని కొబ్బరి తోటలకు ప్రయోజనం కలుగుతుంది. దీంతో పాటు కొబ్బరి తోటల్లో అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. బ్రిటీషు వారి హయాంలో పై గ్రామాలకు ఇరిగేషన్ సదుపాయం ఉండేది. ప్రస్తుతం ఈ గ్రామాలకు ఇరిగేషన్ సదుపాయం లేకపోవడంతో ఆ గ్రామాల రైతులు బోరు బావులపై ఆధారపడి కొబ్బరి సాగు చేస్తున్నారు. అప్పనపల్లి ఎత్తిపోతల పథకం కార్యారూపం దాల్చితే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి



అప్పనపల్లి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాల్సి ఉంది. ఇది ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉంది. సాగునీటి సమస్యతో ఎంతో కాలం నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి ఏడాది వేసవి కాలంలో కొబ్బరి తోటలకు నీరు కట్టేందుకు రూ.వేలు ఖర్చవుతుంది. వేసవిలో మూడు నీటి తడులు కట్టాల్సి ఉంది. బోరు బావుల నుంచి వచ్చే నీరు ఉప్పునీరు కావడంతో తోటలు చవుడు బారి కొబ్బరితోటలు దెబ్బతింటున్నాయి.

– బొలిశెట్టి శివ, రైతు, బి.దొడ్డవరం

సాగునీరు అందించాలి



ఎంతో సారవంతమైన భూములకు సరైన సాగునీరు లేక ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. సాగునీరు అందిస్తే లంక భూముల్లో బంగారం పండుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉప్పునీటితో వ్యవసాయం సర్వ నాశనమైంది. గతంలో లంక గ్రామాల్లోని కొబ్బరి తోటల్లో ఎన్నో పంటలు పండించే వారు. నీటి సమస్యతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం, పాలకులు చర్యలు తీసుకోవాలి.

– తులా మాణిక్యం, రైతు, అప్పనపల్లి

రుణ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు



లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ మల్లికార్జునరావు, బ్యాంకు మేనేజర్లు

మలికిపురం: మండలంలో బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. మొత్తం 1544 దరఖాస్తులు రాగా సదరు దరఖాస్తులు వెరిఫికేషన్, ఇంటర్వ్యూలు ఎంపీడీవో, వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు సంయుక్తంగా నిర్వహించారు. బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 484 మందికి, కాపు కార్పొరేషన్‌కు సంబంధించి 1060 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. బ్యాంకులు వారి సర్వీస్ ఏరియాకు సంబంధించిన అప్లికేషన్లు వారి వెంట తీసుకువెళ్లారు. టార్గెట్స్ అనుసరించి బ్యాంక్ వెరిఫికేషన్ అనంతరం లోన్స్ మంజూరవుతాయని ఎంపీడీఓ మల్లికార్జునరావు తెలిపారు. మలికిపురం ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించగా ప్రశాంతంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, మండల పరిషత్ ఏవో జి.మిల్టన్, సీనియర్ సెక్రటరీలు అబ్బాస్ అలీ, ఐ.శుభాకర్ బాబు, జూనియర్ అసిస్టెంట్ జి.ప్రవీణ పర్యవేక్షించారు.

అయినవిల్లిలో 384 మంది హాజరు

అయినవిల్లి: బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ రుణాల కోసం బుధవారం జరిగిన ఇంటర్వ్యూలకు 384 మంది లబ్ధిదారులు హాజరైనట్లు ఎంపీడీఓ జి.భీమారావు తెలిపారు. క్రాప, మాగం, శంకరాయగూడెం, నేదునూరు, నల్లచెరువు, శంకరాయగూడెం, పోతుకుర్రు, ఎస్.పెదపాలెం గ్రామాల్లోని 479 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరిలో 384 మంది లబ్ధిదారులు హాజరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

కొత్తపేట: తల్లీబిడ్డల ఆరోగ్యానికి సాధారణ కాన్పు (ప్రసవం) ఎంతగానో దోహదపడుతుందని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ గన్నవరపు దుర్గాప్రసాద్ అన్నారు. ఏపీ సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ.సిరి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పి.కార్తీక్ సూచనల మేరకు బుధవారం స్థానిక పభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ వలన తల్లికీ, బిడ్డకు కలిగే ప్రయోజనాలు తద్వారా తల్లీ బిడ్డల సంక్షేమం మన ప్రథమ ధ్యేయం, ప్రతి ఒక్కరూ సాధారణ కాన్పుని ప్రోత్సహించాలి అనే అంశాలపై గర్భిణులకు వారి తల్లిదండ్రులకు, బంధువులకు అవగాహన నిర్వహించారు. డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తల్లికి సాధారణ కాన్పు వలన తల్లికి క్షేమం బిడ్డకు రక్షణ అని తెలిపారు. గర్భం దాల్చక ముందే సాధారణ కాన్పుపై అవగాహనకు దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో కౌన్సెలింగ్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ మోర్త వంశీ, గైనకాలజిస్ట్ డాక్టర్ అన్నపూర్ణ, ఐసీటీసీ కౌన్సిలర్ మెల్లం దుర్గాప్రసాద్, సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: సాధారణ కాన్పుల వల్ల తల్లికి, బిడ్డకి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పి.గన్నవరం సీహెచ్‌సీ డిప్యూటీ సర్జన్ యు.రాఘవేంద్రరావు, గైనకాలజిస్ట్ ఎల్.శిరీష అన్నారు. సాధారణ కాన్పులపై బుధవారం సీహెచ్‌సీలో గర్భిణులకు, తల్లులకు వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కోటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ డి.పల్లవి, హెచ్ఎన్ లక్ష్మీ అనంతకుమారి, మణితేజ, సీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుణ లబ్ధిదారులకు నేడు, రేపు ఇంటర్వ్యూలు

కొత్తపేట: బీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 3, 4 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు 3న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వానపల్లి, వాడపాలెం, పలివెల గ్రామాల వారికి, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు అవిడి, బిళ్లకుర్రు, మోడేకుర్రు, కండ్రిగ, మందపల్లి గ్రామాల లబ్ధిదారులకు బ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. 4వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్తపేట, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు గంటి గ్రామం వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు ఓబీఎంఎంఎస్ దరఖాస్తు, ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ తప్పనిసరిగా తీసుకురావాలని ఎంపీడీఓ సూచించారు.

నేడు 14 గ్రామాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

అయినవిల్లి: మండలంలోని 14 గ్రామాల బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. అయినవిల్లి, అయినవిల్లిలంక, చింతనలంక, కె.జగన్నాథపురం, కొండుకుదురు, మడుపల్లి, పొట్టిలంక, ఎస్.మూలపాలెం, శానపల్లిలంక, సిరిపల్లి, తొత్తరమూడి, వీరవల్లిపాలెం, వెలువలపల్లి, విలస గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు ఈ ఇంటర్వ్యూలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



సిబ్బందికి నగదు రివార్డు అందజేస్తున్న డీఎస్పీ, సీఐ

రావులపాలెం: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి కేసుల్లో పట్టుబడినా పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ హెచ్చరించారు. రావులపాలెం రూరల్ సీఐ కార్యాలయం వద్ద బుధవారం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సర్కిల్‌లోని ఆలమూరు, ఆత్రేయపురం, కొత్తపేట పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ మురళీ మోహన్ మాట్లాడుతూ రౌడీషీటర్లు గత నేర ప్రవృత్తిని వీడి సమాజంలో బుద్ధిగా బ్రతకాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఇటీవల ఆలమూరులో అదృశ్యమైన ఆరుగురు విద్యార్థులను సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

‘చింతం’ సేవలు చిరస్మరణీయం

కొత్తపేట: సీనియర్ జర్నలిస్ట్ చింతం వెంకటేశ్వరరావు సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. చింతం వెంకటేశ్వరరావు దశ దిన కర్మ కార్యక్రమాన్ని ఆయన స్వగ్రామం మండలంలోని మందపల్లిలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, డీఎస్పీ సుంకర మురళీ మోహన్, ప్రముఖ వైద్యుడు మెంటే ఉదయభాస్కర రావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు స్వాతిప్రసాద్ తదితర రంగాల ప్రముఖులు పాల్గొని వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారు మాట్లాడుతూ జర్నలిజంలో వెంకటేశ్వరరావు అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, రాష్ట్ర టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదు చెంచయ్య, డాక్టర్ ఎం.శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావుకు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పరిశీలన

రావులపాలెం: కోనసీమ ముఖద్వారం రావులపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పరిష్కార మార్గాలను సిద్ధం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హైవే అధికారులకు, ఆర్‌అండ్‌బీ, పోలీసు, పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. అధికారులతో కలసి రావులపాలెం సెంటర్ పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన సదస్సు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి శనివారం వాడపల్లి వేంకటేశ్వరస్వామి భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే రావులపాలెం సెంటర్‌ను కూడా సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తామని ఆహ్లాదకరంగా ఉండే విధంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. వాటికి అంచనాలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి, చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ఎల్లవేళలా గుర్తింపు

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా పాఠశాల అభివృద్ధికి ఉత్తమ సేవలందించే వారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని జిల్లా సీఎంఓ బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విత్తనాల ఇంద్రశేఖర్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన బళ్ల శ్రీనివాస్ సన్మాన సభ హెచ్ఎం జి.రాజశేఖర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. వారు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి వారి భవిష్యత్‌కు శ్రీనివాస్ బంగారు బాటలు వేశారన్నారు. పాఠశాలకు రూ.10 వేలు విలువైన కంప్యూటర్ సామగ్రిని శ్రీనివాస్ బహూకరించారు.



శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

అనంతరం ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవిందు, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

వేద పండితుడు ‘కాళ్లకూరి’కి ప్రశంసా పత్రం

ఆలమూరు: గ్రామంలో వేంచేసియున్న అతి ప్రాచీన విక్రమ భట్టేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, ప్రముఖ శైవాగమ వేద పండితుడు కాళ్లకూరి సూరిపండుకు ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలోని వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ప్రశంసాపత్రాన్ని అందజేసింది. తిరుపతిలోని వేదిక్ యూనివర్శిటీ ద్వారా గత 21 రోజులుగా ఆన్‌లైన్ విధానంలో శైవాగమ, వైఖానస, పాంచరాత్ర ఆగమశాస్త్ర విభాగాల్లో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించారు. ఈ క్లాసుల్లో పాల్గొన్న వారికి ఇటీవల వార్షిక పరీక్షలు నిర్వహించగా అందులో కాళ్లకూరి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో తిరుపతిలోని వేదిక్ యూనివర్సిటీ ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ‘ఇంటర్నేషనల్ ప్రశంసా పత్రంతో పాటు వేద పండిత గుర్తింపు పత్రాన్ని కూడా ఆయన స్వీకరించారు శైవాగమ గుర్తింపుపత్రం స్వీకరించిన కాళ్ళకూరి సూరిపండుని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు, మహిళా భజన మండలి సభ్యులు అభినందించారు.



ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న వేద పండితుడు కాళ్లకూరి

సమగ్ర విచారణ జరిపించాలి

ఆలమూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరపడంతో పాటు క్రైస్తవులపై దాడులు అరికట్టాలని మండలం పాస్టర్ ఆఫ్ ఫెలోషిప్ డిమాండ్ చేసింది. మత ప్రబోధకుల ఆధ్వర్యంలో క్రైస్తవులందరూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నో అనుమానాలను కలిగిస్తున్న పాస్టర్ ప్రవీణ్ మృతిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రవీణ్ పగడాల మృతిపై అన్ని విధాలుగా సమగ్ర విచారణ చేసి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న అనేక దాడులను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పాస్టర్ మృతిపై విచారణ జరపాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

20 లీటర్ల సారాతో మహిళ అరెస్ట్

కొత్తపేట: ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన కోట సత్తెమ్మ అనే మహిళను 20 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా నిర్వహించిన దాడుల్లో భాగంగా పేరవరంలో ఈ మహిళను సారాతో అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. నిందితురాలిని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీరభద్రస్వామి సన్నిధిలో కోఆర్డినేటర్



వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామంలో కొలువుదీరిన తులా వారి శ్రీసాయి వీరభద్రస్వామిని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి బుధవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీకి సంబంధించిన పలు అంశాలపై ఆయన పార్టీ శ్రేణులతో చర్చించారు. కూటమి వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేతలు పార్టీని బలోపేతం చేసే దిశగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు విత్తనాల శేఖర్, పార్టీ నేతలు తులా గోపాలకృష్ణ, పార్టీ నేతలు జక్కంపూడి వాసు, యేడిద లక్ష్మణరావు, బత్తుల జనార్దన్, బొంతు చందు, యెరుబండి చిట్టికాపు, కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సప్తాహానికి కలశ స్థాపన



కలశ స్థాపనలో పాల్గొన్న బుల్లబ్బులు దంపతులు

మలికిపురం: గూడపల్లిలోని స్థానిక సుందర వారి మెరకలోని రామాలయంలో 37వ త్రిదశ సప్తమి సీతారామస్వామి సప్తాహం కలశస్థాపన బుధవారం జరిగింది. ఉదయం 7.35 నిమిషాలకు ప్రారంభమైంది. పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుందర వెంకట సూర్యనారాయణ బుల్లబ్బులు, వీరవేణి దంపతులతో కార్యక్రమాన్ని పండితులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారానికి మోహన్ ఎంపిక



సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేది పాలేనికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త నల్లి మోహన్ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు పాన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 4న రాజమహేంద్రవరంలో నిర్వహించే ఉగాది వేడుకల్లో ప్రముఖులు ఆయనకు అవార్డు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన సమాచారం సంస్థ అధ్యక్షుడు అద్దంకి రాజా నుంచి వచ్చినట్టు మోహన్ బుధవారం మీడియాకు వెల్లడించారు. వివిధ దేశాల నాణేలను, కరెన్సీలను సేకరించడం విద్యార్థి దశ నుంచి మొదలు పెట్టినట్టు ఆయన అన్నారు.

వ్యాక్సిన్‌తో రోగాలకు చెక్

అంబాజీపేట: చిన్నారులకు, గర్భిణులకు, కిశోర బాలికలకు వ్యాక్సిన్ వేయడం వల్ల వ్యాధి రోగాలకు చెక్ పెట్టవచ్చని సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరం సచివాలయం–1, 4లలో యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ పీహెచ్‌సీలతో పాటు సచివాలయాల వద్ద వ్యాక్సిన్ వేస్తున్నారని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వడగాడ్పులకు గురి కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎం.భూలక్ష్మి, హెచ్‌వీ ఎస్.శాంతకుమారి, ఏఎన్ఎం ఎం.అర్జమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి తల్లికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.13,500 ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన మేడిచర్ల కృష్ణచైతన్య 20 రోజులు క్రితం రాజమహేంద్రవరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బ్రెయిన్‌కి గాయమవడంతో తలకి ఆపరేషన్ చేశారు. ఇప్పటికే రూ.10 లక్షలు వరకు ఖర్చయ్యింది. ఇంకా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. దీంతో అంత ఆర్థిక స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో సభ్యులు హాస్పిటల్‌కి వెళ్లి కృష్ణచైతన్య తల్లి సీతామహాలక్ష్మికి సంస్థ సభ్యులు చేతుల మీదుగా సాయాన్ని అందజేశారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంక శివారు కొత్తలంకలో స్థానిక జైభీమ్ ఆదర్శ యువజన సంఘం గురువారం నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం టోర్నమెంట్ నిర్వాహకులు వివరాలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో తొమ్మిదో వార్షికోత్సవం పురస్కరించుకుని గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రోత్సాహానికి ఈ చర్యలు చేపట్టామన్నారు. కాగా టోర్నమెంట్‌ను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రారంభించనున్నట్టు, పలువురు ప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు చెప్పారు.

పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ



ఊబలంక పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న వెంకటేశ్వరరావు

రావులపాలెం: మండలంలోని ఊబలంక, గోపాలపురం పీహెచ్‌సీలను బుధవారం జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రుల నిర్వహణ, తదితర అంశాలను ఆయన పరిశీలించారు. రానున్న సీజన్‌లో మలేరియా ప్రబలకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. విధిగా సర్వేలు నిర్వహించి జ్వరం ఉన్నవారికి రక్తపోతలు తీసి మందులు పంపిణీ చేయాలని సూచించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి



మామిడికుదురులో పారిశుధ్య పనుల్ని పరిశీలిస్తున్న డీపీఓ శాంతాలక్ష్మి

మామిడికుదురు: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి సూచించారు. ఆమె బుధవారం మామిడికుదురులో పర్యటించారు. అక్కడ చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న షాపు యజమానులతో చర్చించారు. చెత్తను రోడ్డు పక్కన పడేయకుండా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకుని వాటిలో వేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేసుకోవాలని సూచించారు. ఆ చెత్తను పంచాయతీ సిబ్బంది సేకరించి ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించాలని సూచించారు. పారిశుధ్యం విషయంలో ఏ ఒక్కరూ ఏమరుపాటుగా ఉండరాదని చెప్పారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు, సిబ్బంది ఉన్నారు.

భూముల రీ సర్వేకు సహకరించాలి



మోరిలో రెవెన్యూ సదస్సుపై అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సఖినేటిపల్లి: గ్రామాల్లో రెవెన్యూ శాఖ సిబ్బంది చేపట్టబోయే భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మోరి పంచాయతీ వద్ద రైతులతో ఈ మేరకు అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే వారు సదస్సు ఏర్పాటు చేశారు. సర్వేయర్ భద్రరాజు మాట్లాడుతూ, సర్వే నెంబర్ల వారీగా భూములు రీ సర్వే చేసేందుకు టీంలను ఏర్పాటు చేసినట్టు, రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి సర్వేకు సిబ్బంది వస్తారని తెలిపారు. కాగా రీ సర్వేపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను డీటీ భాస్కర్ నివృత్తి చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల ఆర్ఐ రామరాజు, వీఆర్వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ ప్రారంభం

అయినవిల్లి: విలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి కొప్పిశెట్టి రామకృష్ణ నిర్మించిన డైనింగ్‌హాల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా బుధవారం ప్రారంభించారు. అలాగే ఎన్ఎంఎస్ స్కాలర్‌షిప్ తీసుకున్న ఏడుగురు విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు పీవీ రవిప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ అమలకట్ల చక్రవర్తి తదితరులు ఉన్నారు.

సూరిబాబు కుటుంబానికి పరామర్శ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం ప్రభాకర్‌నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుత్తుల సూరిబాబు కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ, పి.గన్నవరం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించారు. సూరిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. సూరిబాబు మృతికి శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఆర్.మీరయ్య, ఆర్.షణ్ముఖ్, పాలమూరి బాలరాజు, దొంగ హరి, ఆర్.స్వామి, ఆర్.కృష్ణమహేష్ పరామర్శించిన వారిలో ఉన్నారు.